# లవ్ స్టోరీ

అజ్ఞాత ప్రేమికుడు

ఈ మగాళ్ళ చూపులు నా మీదకి ప్రసరించడానికి కారణం—అది వాళ్ళకి సహజమా, లేక వయసు ప్రభావమా అనుకుంటాను. నా తోటి వాళ్ళ పేర్లు బోర్డు మీదనో - బెంచీల మీదనో రాతల రూపంలో అసహ్యంగా అన్పిస్తోవుంటే ఇంకా మగాళ్ళను మంచిగా భావించడానికి ఆస్కారమేమీ కన్పించలేదు.

క్లాసురూమ్‌లో కూర్చున్న దగ్గర్నుండి స్టూడెంట్స్, లెక్చరర్ల గద్ద చూపులు ఎబ్బెట్టుగానూ, వాళ్ళు ఆడపిల్లల అందానికి నీళ్ళు నమిలినప్పుడు హాస్యం గానూ అన్పిస్తో వుండేవి. ఎన్ని తంటాలు పడ్తున్నారో కదా— మాకై' అని గర్వపడేదాన్ని. ఉదయం ఇంట్లోనుండి కాలు బయట పెట్టిప్పటినుండీ, సాయంత్రం మళ్ళీ ఇంట్లోకి అడుగు పెట్టేదాకా అడుగడుక్కీ కుర్రవాళ్ళనీ, వయసు మళ్ళిన వాళ్ళనీ లేకుండా ఒకటే కామెంట్లు విసుర్తూనో, వెకిలిగా నవ్వుతూనో,...ఆ దరిద్రపు చూపులు మరీ! అలవాటై పోయింది. నాకివి భరించడం.

ఎవరికీ పట్టదు నామనసు గురించి. ఓ రోజు నా బెంచీమీద 'పవన్ జ్యోతి' అన్న అక్షరాలు చూసి కోపంతో వొణికిపోయాను. తన పేరుని నాపేరుతో జతచేసింది కాక నా వంకే ఘోరంగా నవ్వుతో చూస్తున్నాడు. అప్పుడు నేను కొట్టిన దెబ్బకి — మళ్ళీ అతగాడు నా వొంక కన్నెత్తి చూడలేదు. అందరికీ నేనేమిటో తెల్సింది. ఎవరూ ఇంక నా పట్ల సాహసానికి పూనుకోలేరు. నా చిక్కల్లా శ్రీను గురించే అతడి చూపులు అదోవిధంగా వుండేవి. అందరిలో అతడ్ని కలపలేకపోయాను. అతడి మీద నాకేమైనా ఆకర్షణ పుట్టిందా? అని యోచిస్తోవుంటే... అట్లాంటిదేమీ కాదన్పించింది. క్లాస్‌లో ఎప్పుడైనా అటు చూశానంటే దీనంగా అతడి చూపు గోచరించేది. లెసన్ వినకుండా అదే పనిగా నా వంకే ఎందుకు చూస్తాడని, అతడికేమి హక్కుందా అని, ఎప్పుడైనా నిలేయాలనుకుంటాను. ఎందుకో ఆపని చేయలేకపోతున్నాను. జాలిలాంటిదతడిమీద. ఎంత కాలమో ఆ చూపుల్ని తట్టుకోవడం... అందరిదీ ఒక లెక్కయితే అతనొక్కడిదీ వొక లెక్క. నవ్వు విసరలేదెప్పుడూ అతడు. అడ్వాన్స్ కూడా కాలేదు—ఎంత కాలమైనా నాతో మాట్లాడటాన్కి కూడా ప్రయత్నించలేదు. ఎప్పుడూ ఆ అసహాయపు చూపులే. నావెనక ఆచూపు వీపుని చీల్చుకుని గుండెదాకా వొస్తుందేమోనని భయపడ్డాను. ఏమో...ఎంత శక్తి ఉందో—చూపుకి.

"శ్రీనూ! నావేపు ఎందుకలా చూస్తావు?" అనడిగాను ఉండబట్టలేక చిన్నపిల్లవాడికి మల్లే "నువ్వంటే నాకు చాలా యిష్టం" అన్నాడు. నవ్వుతో వెళ్ళి పోయాను. తలచుకొని, తలచుకొని నవ్వుకుంటూ వుంటాను—ఆ మాటలన్నప్పుడు అతడి ముఖంలోని భావాలకి. ఇంకెప్పుడూ శ్రీనుతో మాట్లాడలేదు.

ఇంటర్మీడియట్ అయ్యాక అదే కాలేజిలో బి.ఎలో చేరాను. వయసుతోపాటే పరిపక్వం చెందినాయి—నావొళ్ళు, హృదయమూ నాకిది వరకే తెలుసును—నేనెంత అందంగా వుండేది. క్లాస్‌లో స్ట్రెంగ్త్ తగ్గింది ఇంటర్మీడియట్ కన్నా. మొత్తం నలభై మందిలో పన్నెండుమంది ఆడపిల్లలం. మగధీరుల క్లాస్‌రూమ్‌ల్లోని చర్యలు మమ్మల్ని వుద్దేశించే వుండేవి. అందరూ మగవాళ్ళతోటి మామూలుగానే మాట్లాడుకుంటున్నారు. నేనే వాళ్ళలో కలవను—ఈ ఒక్క విషయంలో. ముందు మామూలుగానే మాట్లాడి హఠాత్తుగా అతిచనువు ప్రదర్శిస్తారని నాకు తెలుసు—ఈ మగవాళ్ళ గురించి. ఒక ప్రహసనమైపోయింది—ఏదో విధంగా నాతో మాటలు కలపాలని వాళ్ళు ఆరాటపడ్డం, నేను వాళ్ళని నీరుకార్చడమూ.

ఆ రోజు నాకు చాలా ఆశ్చర్యమయింది. హేమ వొచ్చి "రామారావు ఇమ్మన్నాడే" అంటూ ఓ కవర్ ఇచ్చింది. అది గ్రీటింగ్ అని తెలుస్తూనేవుంది. 'రామారావు ఇమ్మనడం ఏమిటా' అని గ్రీటింగ్ చూస్తే అందులో 'యువర్ హార్ట్ శ్రీను' అని కనిపించడంతోటి విషయం అర్థమైంది. రామారావు, శ్రీను స్నేహితులు—అదీ విషయం. శ్రీను ఇంటర్ తర్వాత వెటర్నరీ చదువుకి తిరపతి వెళ్ళిపోయాడు. అప్పుడప్పుడూ ఇక్కడికొచ్చి నా వొంక అదేపనిగా ఇంతకు మునుపు వలే కాకుండా కొంచెం తీవ్రంగా చూపులు విసరడం నేను గమనిస్తూనే వున్నాను. శ్రీనులో ఈ మార్పు, ఈ ధైర్యం వెటర్నరీలో చేరినందువల్ల వచ్చాయా? అనిపించింది. 'గ్రీటింగ్ పంపుతాడా' యువర్ హార్ట్ అని' అన్చెప్పి రామారావు నోరెళ్ళబెట్టుకొని చూస్తుండగానే పరపరా చింపి ఆ ముక్కలు హేమ చేతిలో పెట్టి 'వాటిని భద్రంగా దాచుకొమ్మని చెప్పు' అన్నాను. హేమ ఆ ముక్కలు ఇస్తుంటే చూడాలి—పాపం రామారావు! మధ్య వర్తిత్వం నెరపబోయి చిన్నబోయాడు.

కానీ ఒకటే ఆలోచన—ఆడవాళ్ళ మీద ఎందుకింత ఇంటరెస్టు వీళ్ళకని. ఆ ఇంటరెస్టు అయినా మేమేదో వాళ్ళు చెప్పినట్టు వినే మరబొమ్మలు అనుకునేటువంటిది. మా మనసులో ఏముందని ఎందుకసలు ఆలోచించరు? మనసులే లేవనుకుంటారా మాకు?

ఆ తర్వాత కూడా శ్రీను నాకై, నానవ్వుకై ఎంతో ప్రయత్నాలు చేశాడు. పసివాడని ఒకప్పుడు నేను భావించాను. నేనీ ఇప్పుడతని చేష్టలకి విస్మయపడ్తో, అతడి మీదున్న అభిప్రాయాన్ని మార్చుకుని, అతడ్ని కూడా అందరిలోకీ నెట్టేశాను.

యాన్యువల్ ఎగ్జామ్స్ జరుగుతున్నప్పుడు కనిపించాడొకసారి. నేను, మరో స్నేహితురాలు కలిసి పోతుంటే మా వెనక పడ్డాడు. "ఏం చేస్తే ఇది చేతికి చిక్కుతుందిరా. తిరపతిలో ఎంతోమందిని చూశాను. ఇంత నిక్కున్న దాన్ని చూడలేదురా" అంటున్నాడు శ్రీను. "ధైర్యం చేసి డైరక్ట్‌గా రంగంలోకి దిగరా" చెప్తున్నాడు ప్రక్కనున్న వాడు. మాకా మాటలు వినిపిస్తాయన్న స్పృహ లేకుండా అంత నీచంగా, అసహ్యపు మాటలు మాట్లాడ్తోంటే కంపరంతోటి వొళ్ళు జలదరించింది. "ఇట్లాంటి దరిద్రపు కూతలు కూసేవాడ్ని ఏం చేస్తే బాగుంటుందే" అంది నా స్నేహితురాలు.

"మూతిమీద ఇంకా మీసం కూడా సరిగా రాలేదే. ఈ సరికి వదిలేద్దాం" అన్నాను నవ్వుతో. విని తక్కున మూతులు బిడాయించుకొని అటే

పోయారు—కిక్కురు మనకుండా. వాళ్ళ 'ధీరత్వాన్ని' చూసి పకపకమని నవ్వుకుంటూ వెళ్ళిపోయాము.

"నేను ఇంక కాలేజీకి పోను" అని వాణి ఏడుస్తోంది. ఇంట్లో అందరం నాయనమ్మతో సహా ఏమీ మాట్లాడలేకపోతున్నాం. అది చాలా తెలివైనది. నాకన్నా ఎన్నో రెట్లు తెలివి తేటలు చదువులో చూపిస్తోంటోంది. అయితే సమస్య అది కూడా ఆడపిల్లే కదా. ఎంతకాలమైనా ఇలా భరిస్తోవుండవలసిందేనా—ఆడవాళ్ళని పీడించుకుతినే పురుషులని అదుపులో పెట్టేవాళ్ళు అసలు లేనే లేరు. వాళ్ళు వయసు ప్రభావం వల్లనో, కావాలనో చేస్తోన్న పనుల వల్ల ఆడవాళ్ళ బ్రతుకులే నాశనమవుతున్నాయని ఎందుకు ఆలోచించరు?

ఇప్పుడు వాణికి ఉత్తరమొచ్చింది. అందుకే కాలేజీకి పోనని ఏడుస్తోంది. ఏముందో ఉత్తరంలో అంటే ఇంతేసి ఎర్రని అక్షరాల్తోటి 'ఐలవ్‌యూ' అంటూ పి.శ్రీను అంట. విపరీతమైన కోపమూ, ద్వేషమూ అతడిమీద. తన ట్రిక్కులన్నీ నామీద ప్రయోగించి విఫలమయ్యేసరికి, ఇప్పుడు నా చెల్లెలి మీద ప్రయోగానికి పూనుకున్నాడని కక్ష పుట్టింది. ఏమైనా వాణ్ణి వదలకూడదనుకున్నాను.

అంతకసి అతడిమీద ఏర్పడింది.

రామారావుకి ఆ ఉత్తరం ఇచ్చి "నీ గొప్ప ఫ్రెండ్ ఇంకా ఎన్ని గొప్ప పనులు చేయబోతున్నాడు" అన్నాను క్రోధంగా. ముఖంలో వున్న రక్తమంతా ఇంకిపోతుంటే నా వొంక, ఉత్తరం వొంక చూస్తూ, నెమ్మదిగా అన్నాడు చివరికి—"ఇది మావాడు వేసింది కాదండి. వాడి పేరు ఎస్. శ్రీను. అయినా ఇది కడప నుండి కదా వొచ్చింది."

అప్పుడు చూశాను నేను కూడా...నేను పొరబడ్డాను—అది నేననుకునే శ్రీను వేసింది అనుకొని. మరయితే ఈ శ్రీను ఎవరు? కడప నుండి వేశాడంటే, ఇక్కడతనే కడపలో ఉండి చదువుతూ వుండాలి. అప్పుడు స్ఫురించింది, అతడెవరైందీ.


నాయనమ్మకు చెప్పాను—వాళ్ళింట్లో వాళ్ళకు చెప్పి హెచ్చరించమని. "వాళ్ళసలే మంచివాళ్ళు కాదమ్మా. ఈ విషయం ఊరంతా చాటింపేస్తారు. మన పరువు పోతుంది." అంది నాయనమ్మ. ఇక్కడ వున్నట్లయితే అతడ్ని నేనే ఎదుర్కొని తగుబుద్ధి చెప్పి వుండేదాన్నే. ఆడపిల్లల తల్లిదండ్రులు ఇట్లాంటి విషయాల్లో ఎంత పిరికిగా ప్రవర్తిస్తే అంతమంచిగా వుంటు

ందంట—ఈ సంఘంలో నేనొక్క దాన్ని పోయి వాళ్ళతో ఎట్లా చెప్పను—"మీ అబ్బాయి ఇట్లా మా చెల్లెలికి ఉత్తరం రాశాడ"ని.

అయితే ఆ తర్వాత ఈ పి.శ్రీను నుండి మరెలాంటి ఉత్తరం రాలేదు. కొంచెం దిగులు తగ్గింది. వాణి మామూలుగానే కాలేజీకి వెడుతోంది.

నేను సెకండియర్లో వుండగా స్టూడెంట్స్ మధ్య రాజకీయాలు చూసి ఎంతో విచారపడ్డాను. ఎలక్షన్లప్పుడు మా ఆడవాళ్ళకి దండం పెడుతోవున్నారు—'మాకు ఓట్లెయ్యమని' ఆడవాళ్ళ ఓట్లే వాళ్ళ భవిష్యత్తని వాళ్ళకి తెలుసును. ప్రతి ఒక్కడూ రౌడీలుగా గూండాయిజం చెలాయిస్తోవున్నారు. కిరాయికి మనుష్యుల్ని పిలిపించి అవతలి వాణ్ణి బెదిరిస్తోవున్నారు—ఎలక్షన్లనుండి తప్పుకొమ్మని. చివరికివి రక్తపాతానికి దారి తీసేట్లున్నాయని ప్రిన్సిపాల్ గారు ఎలక్షన్లనే రద్దు చేశారు. మేమంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాం.

ఓ రోజు, మాకు సెలవుల్లో ఉత్తరమొచ్చింది—నాపేర. పేరులేదుకానీ హైదరాబాద్ అని ఫ్రమ్ అడ్రస్‌లో వుంది. అక్కడనుండి ఉత్తర మేసేదెవరా అనాలోచిస్తే,



ఎవరో జ్ఞాపకం రాలేదు. మగవాళ్ళే అయివుంటుందని ఊహించాను.వాళ్ళే పేరు రాయకుండా వుండేది, ఉత్తరం పైన ఇంటర్మీడియేట్ తర్వాత చదువుకోసమై హైదరాబాద్ వెళ్ళినవాళ్ళెవరూ తట్టలేదు మనసుకి.

తెరచి చూస్తున్నాను.

అరుణ గార్కి!

నా పరిచయం ఇప్పుడే చేసుకోట్లేదు. నేను మాత్రం మీకు తెలుసు. బాగా ఆలోచిస్తే తెలుస్తానేమో. పది తర్వాత నేను ఒంగోల్లో డిప్లొమా చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చాను. అప్పుడప్పుడూ మనవూరు వచ్చిపోతోవుంటాను. అలా అంతకు ముందే మీరు నాకు తెలుసు. అక్షరాల్లోని మహత్యం వల్ల మీ అందం నన్ను మీ వేపు లాక్కుంది.

అక్కడ వుండే రెండు, మూడు రోజుల బజార్లో టీ బంకులో కూర్చుని మీరు కాలేజీకి వెళ్ళడాన్ని ఎంతో ఆనందంగా చూస్తుండేవాణ్ణి. ఇక్కడకొచ్చి మనవూర్లో వుండే స్వేచ్ఛనీ. స్వచ్ఛతనీ, హాయైన వాతావరణాన్ని...ఇంకా ఎన్నిటినో దూరం చేసుకున్నాననిపిస్తోంది. నాకు ఊరట కల్గించే ఆప్యాయపు మాటలు చెప్పే వాళ్ళిక్కడ లేరు.

నాకు సరైన మిత్రులు కూడా లేరు. '(ఫ్రెండ్స్ సర్కిల్' అనేది ఇంటర్‌లోనో, డిగ్రీలోనో ఏర్పడుతుంది. కానీ నేనవేవీ చదవ లేదు. టెన్త్ అవడంతోనే డిప్లొమాలో చేరిపోయాను. ఈ లోపం మీ నుండి తీరుతుందా అనాలోచించాను. అయితే కేవలం నేను మీనుండి ఫ్రెండ్‌షిప్ మాత్రమే ఆశించట్లేదని మీరర్థం చేసుకోండి.ఎందుకంటేముందే తెలియజేసినట్లు నా హృదయం మీదే. మీనుండి ఉత్తరం వస్తుందన్న నమ్మకమేమీ గట్టిగా నాలో లేదు. పదహారు, పదిహేడేళ్ళకే చాలామంది ఆడవాళ్ళు ప్రేమలో పడటం నాకు తెలుసును. అలా మీరిదివరకే ఎవరితోనన్నా ప్రేమలో పడినట్లయితే నేను చాలా దురదృష్ట వంతుణ్ణవుతాను.అయినా నేను ఆశాజీవిని.

నేనెవరో మీకు తెలిశాక మీరు నన్ను తృణీకరించవచ్చు. మీరు మానసికంగా ముందుగా ప్రిపేరయ్యాక నెమ్మదిగా తెలియజేస్తాను—నేనెవరైందీ. ఉత్తరం కాలేజీకి వేస్తే గొడవవుతుందేమోనని ఇంటికే వేస్తున్నాను. ఇంట్లో వాళ్ళడిగితే 'పెన్‌ఫ్రెండ్ దగ్గర్నుండి' అని చెప్పండి.

మీ

-----

ఎంతో విస్మయానికి లోనయ్యాను. ఊరు తప్ప పేరులేని ఈ అనామకుడెవరా అని యోచించాను. తెలిసిరాలేదు. ఉత్తరంలోని ప్రతి పదాన్ని విశ్లేషించి చూస్తే అతడు మాకు తెలిసివుండవొచ్చనీ, ఇక్కడకొచ్చినప్పుడల్లా నన్ను అబ్జర్వ్ చేస్తుంటాడనీ అనిపించింది. మంచి రచయిత కాగల లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. ఆ అక్షరాలు చూస్తుంటే. ఎవరినడిగి తెలుసుకోవాలి నేను—ఈ ఉత్తరం రాసిన మహానుభావుడెవరా అని ఎవరినడగను అయినా. పెద్ద సమస్యలా అన్పించింది. మగవాళ్ళ గురించీ, వాళ్ళ మనస్తత్వం గురించీ ఎన్నో రకాలుగా తెలిసివుండటం వల్ల నన్ను వంచించడానికే ఆ ఉత్తరం రాశాడనిపించింది. 'ఈ ట్రిక్స్ అన్నీ తెలియని వాళ్ళ మీదే కానీ, నామీద పని చేస్తాయా' అని నెగ్లెక్ట్ చేశాను.

సరిగ్గా పదిరోజులకి మళ్ళీ ప్రత్యక్షం ఉత్తరం

"అరుణ గారూ!

నా ఉత్తరం చదివాక ఏమనిపించింది మీకు? వయసు చేష్టలని భావించి చింపేయలేదు కదా! వయసు ప్రభావం మాత్రం కాదని గట్టిగా చెప్పగలను. నా గురించి గొప్పగా

చెప్పుకుంటున్నానని మీరనుకున్నా సరే—నేను అందరి లాంటి వాణ్ణి మాత్రం కాను. అందుకే డిప్లొమా చదివేప్పుడు కూడా నేనెవరికీ స్నేహితుణ్ని కాలేకపోయాను. అప్పుడు నాకు మూడు రకాల వ్యక్తులు ప్రత్యక్షమయ్యారు. ఒక రకం వ్యక్తులేమో...వీళ్ళకెప్పుడూ సినిమాలూ, షికార్లూ, ఆడపిల్లలను కామెంట్ చేయడం, ఆనకంచివాట్లు తినడం; మరో రకం వ్యక్తులయితే ...ఎప్పుడూ గొడవలే వీళ్ళకి. ఎవడ్ని గిల్లదామా, వాడెదురు తిరిగితే నలుగురం కలిసి తందాం, లేక పొడుద్దాం అనే. సామూహికంగా తప్ప ఒంటరిగా అవతల వాణ్ణి ఎదుర్కొనే సత్తా వీళ్ళకుండదు. ఎప్పుడూ ముఠాలుగా తిరగడానికే ప్రాముఖ్యతనిస్తుంటారు. ఇంక మూడోరకం వ్యక్తులు...తమ చదువు తప్ప మరో విషయం పట్టించుకోరు. స్పందనకు వీళ్ళలో తావేవుండదు. అందుకే నేను ఈ మనుషులతోటి స్నేహం సంపాదించుకోలేక పోయాను.

-----

రచయిత చిరునామా:

బి. యజ్ఞమూర్తి

s/o కోట నాగేశ్వరరావు

బుద్ధివారి వీధి అణుమల్లి పేట

వేటపాలెం 523187

-----

సాహిత్యమంటే ఉన్న మక్కువ వల్ల ఇక్కడి నవయుగ బుక్‌హౌస్‌లో గొప్ప వాళ్ళ పుస్తకాలు కొని, చదివి స్త్రీల పట్ల గౌరవాన్నీ, ప్రేమనీ ఏర్పరచుకున్నాను. సంఘంలో వాళ్ళ కష్టాలు చదివీ, చూసీ కదలిపోతుంటాను.

మీరింతకీ నేనెవరైందీ కనిపెట్టగలిగారా? బహుశా ఇంకా తెలిసుండదు. చెప్పాలనే వుంది నాకు. ఇంకో ఉత్తరం దాకా పొడిగియ్యాలనిపించింది ఎందుకో. క్షమించండి. నాకిప్పుడు ఎంతో శాంతిగా వుంటోంది—ఇలా ఉత్తరాల్లో మీకు నా హృదయాన్ని బయట పెట్టుకోవడం వల్ల. మీ ఆలోచనల వల్ల నేను ఒంటరివాడినన్న భావం నాలో కలగడం లేదిప్పుడు.

మీ జ్ఞాపకాలే నా హృదయాంతరాలలో కదలాడకపోతే నేను జడపదార్థంగా మారిపోయి యాంత్రికంగా బతకడానికి అలవాటు పడిపోయేవాడినేమో! ఆ ప్రమాదం మీ కారణంగానే తొలగిపోయిందని మీరు గ్రహించగలిగితే నామీద మీకు చెడు అభిప్రాయం కాకుండా ఓ మంచి అభిప్రాయం కలిగే అవకాశం వుంది. నామీద మంచి అభిప్రాయం ఏర్పరుచుకొమ్మని కట్టడి చేయలేను కదా—అయినా ఆశావాదిని నేను.

మీ

.........

-----

మగాళ్లమీద నేనర్పరచుకున్న భావాల్లో కొన్ని నెమ్మదిగా నాలోనుండి దూరమైపోవడానికి ఉద్యుక్తమవుతున్నాయ్. ఈ అజ్ఞాత ప్రేమికుడు నన్ను మెస్మరైజ్ చేస్తున్నాడా అని ఎంతగా అనుకున్నా గానీ, ఈ ఉత్తరం తర్వాత—అప్పటి దాకా ఉన్న ఉద్దేశం మారి పోవడం మొదలైంది. ఎవరో అర్థంగాని ఈ యువకుడ్ని గురించి నా మనసు అదే పనిగా ఆలోచనలు సాగిస్తోంది. క్రమంగా నా మనసుని అతడికనుకూలంగా మలచుకుంటున్నానని తెలిసినా వేరే గత్యంతరం లేకపోయింది. అతడిపట్ల మృదువైఖరి ఆరంభమైంది. చాటుగా ఆ ఉత్తరాల్ని తరచి, తరచి చదువుతూ నవ్వుకుంటున్నాను.

"ఎవరోయినీవు!" అంటూ మాట్లాడుతున్నానతనితో

"నీ హృదయాన్ని" అని అతడు చెప్పినట్లయి ఉలిక్కిపడుతున్నాను.

"నాహృదయమా నీవు. కాదు నా హృదయం నాది, నీ హృదయం నీ దగ్గరే వుంచుకో" అని చెప్పలేకపోతున్నాను. నా హృదయం నాదికాదని

తేలిపోయింది కనుక.

ఈ మారు ఉత్తరం కోసం నేనే పడికాపులు కాచాను. ఎప్పుడొస్తుందా ఎప్పుడొస్తుందా? అని ఒకటే ఆత్రం. ఒక్కొక్కరోజు పోయేకొద్దీ 'ఇంకా రాలేదే' అని విచారం. ఇంకేం వ్యాపకం లేదు ఎదురుచూడ్డం తప్ప, అతడి ఉత్తరానికై. ఈ సారితో సస్పెన్స్ విడిపోతుంది—అతగాడెవరో.

పేరు తెలిశాక 'ఓస్—ఇంతేనా' అనిపిస్తుందా, తెలిసినా ఇంకా ప్రేమిస్తుందా? ఆదర్శ మానవుడికి మల్లే అతడి భావాలు... నన్ను పట్టుకున్నాయ్. ఇంక అవి వొదలమేమో.

ఒక్కరోజెక్కువ పట్టింది—ఈసారి ఉత్తరానికి ఇప్పుడు చేతులు వొణికిపోతున్నాయ్ తెరుస్తోవుంటే.

అరుణగారూ!

నన్నింకా గుర్తించలేదు. అవునా! నేనండీ, జయదేవ్‌ని జ్ఞాపకమొచ్చానా! ఆశ్చర్యపోతున్నారా అప్పుడే! 'ఇతడని అనుకోలేదే' అని నిరాశ పడిపోతున్నారా? అల్లాగయితే నేను దురదృష్టవతుణ్ణే. అయినా నేను నేనుగాక మరొకరివని చెప్పలేను కదా!

నన్ను మీరు చాలా సార్లే గమనించివుంటారు. అవునా! మా పిన్ని మీకు అత్తయ్యే కదూ! అప్పుడప్పుడూ వొస్తూనేవుంటారు మా పిన్ని వద్దకి. మరి నన్ను గుర్తించలేకపోయారంటే 'జయదేవ్' గా నేను మీ ఊహల్లోకి ఎప్పుడూ రాలేదన్నమాట. 'జయదేవ్'గా సక్సెస్ కాలేకపోయాను. ఇలా సాధించాను. సాధించానా! అపనమ్మకమే. మీ ఉత్తరంతో నా అనుమానాలన్నీ తీరతాయి.

నా హృదయం మీదేనని పూర్తిగా తెలిశాక కూడా మీరు నన్ను, నా ప్రేమని స్వీకరించకుండా వుండగలరా అన్పిస్తోంది. నా ప్రేమకి ఆ మాత్రం బలం లేదని అనుకోలేను. ఇంతకు ముందులా ఇప్పుడు స్వేచ్ఛగా రాయలేకపోతూవున్నాను. నన్ను మీ ముందు బయటపెట్టేశాను కదా—అదీ భయం. కష్టపెట్టరని ఆశిస్తో...

మీ
జయదేవ్

విభ్రమ పడ్డానా, ఆనంద పడ్డానా...ఎలాంటి భావం కలుగుతోంది? జయదేవ్. ఎన్నిమార్లు చూడలేదతన్ని. అతడ్ని ప్రత్యేకంగా ఎప్పుడూ గమనించలేదు. అతి సాధారణంగా, యువకులకి ఉండే డాబు, భేషజం లేకుండా వుండే అతడి మీద నా ఆలోచన లెప్పుడూ పోలేదు. మా అత్తావాళ్ళింటికెప్పుడెళ్ళినా, అతడు నాకెదురుపడినా మాట్లాడిన జ్ఞాపకమే లేదు. అత్తావాళ్ళ తోడికోడలు కొడుకుగా మాత్రమే అతడు నాకు తెలుసును అంతవరకే! ఇక అతడెప్పుడూ నా ఆలోచల్లోకి రాలేదు. జయదేవ్! నిజమేనా, ఎంతాశ్చర్యం! 'నీ వేనా నా హృదయానివి.

'నీవు దిగులు పడనక్కర లేదోయ్. నాహృదయం అజ్ఞాత ప్రేమికుడికెప్పుడో ఇచ్చేశాను. అది నీవని తెలిసింది. నీవేగా అజ్ఞాత ప్రేమికుడివి. మళ్ళీ ఎలా వెనక్కి తీసుకోను.'

పర్వతమైంది జయదేవ్ మీది ప్రేమ. చాలా తియ్యని ఊహలు ప్రవాహమై చెలరేగుతో వున్నాయ్ మనసులో. హృదయంలో ఎంతానందం కలిగిందంటే... కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. చిరునామా చూశాను. ఆ ఉద్విగ్నతలో అతడికి నా హృదయాన్ని మనస్పూర్తిగా సమర్పిస్తున్నట్టు ఉత్తరం రాస్తే గానీ ఉపశమించలేదు.


త్రివేణి

ఫోన్: 260597

రెసిడెన్షియల్ కాలేజి

(1990 EAMCET లో 7వ ర్యాంకు సాధించిన గౌతమీ అకాడమి వారి ఆధ్వర్యంలో)

8-2-628, రోడ్ నెం.13, బంజారాహిల్స్, హైదరాబాద్-34

ఇంటర్ మొదటి మరియు రెండవ సంవత్సరాలకు M.P.C., B.P.C. గ్రూపులందు తెలుగు మరియు ఇంగ్లీషు మీడియంలలో అడ్మిషన్లు ప్రారంభం

* S.S.C.లో ఫస్ట్‌క్లాసు లేదా C.B.S.E., I.C.S.E. లలో 55% సాధించిన విద్యార్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులు.
* ఇంటర్మీడియట్‌తో పాటు ప్రారంభం నుండి EAMCET కోచింగ్.
* EAMCET లో సహితం వారాంతపు పరీక్షలు.
* ప్రశాంతమైన పరిసరాలలో, సువిశాల భవనాలలో హాస్టలు వసతి.
* సమగ్రమైన ప్రయోగశాలలు & లైబ్రరీ.
* 10 సం॥లపై బడి అనుభవము మరియు ప్రతిభావంతులైన అధ్యాపకులచే శిక్షణ.
* పౌష్టిక మరియు సమతుల్య ఆహారం.

అకడమిక్ డైరెక్టర్స్:
కె. ప్రభాకర రెడ్డి M.Com.,
వి. పురుషోత్తమ రావు M.Sc.,
టి. వెంకట్ రెడ్డి M.Sc.,
G.V.S.L.N. ఆచార్య M.A., MPhil

దరఖాస్తు మరియు ప్రాస్పెక్టస్‌లకై పై అడ్రసులో గానీ లేదా 45/3RT, గౌతమీ అకాడమీ, సంజీవ రెడ్డి నగర్‌లో స్వయంగా 20/-రూ. చెల్లించి లేదా త్రివేణి రెసిడెన్షియల్ కాలేజి పేర 25/-రూ. D.D./M.O. ద్వారా చెల్లించి పొందవచ్చును